# అస్తిమిత నక్షత్రం ఆలూరి బైరాగి

ఆలూరి బైరాగి తెనాలి (ఐతా నగరం)లో 1925 నవంబర్ 5న జన్మించారు. కవి, కథకుడు, కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత అన్నిటినీ మించి మానవతా వాది. ఆజన్మ బ్రహ్మచారి. హిందీ, ఇంగ్లీషు, తెలుగు, బెంగాలీ భాషలలో ప్రావీణ్యం వుంది.

చక్రపాణి పిలుపు మేరకు మద్రాసు వెళ్ళి కొంతకాలం చందమామ హిందీ ఎడిషన్‌కి ఎడిటర్‌గా పనిచేశారు. ఎమ్.ఎన్.రాయ్ భావాలకు ప్రభావితులైన మేధావి.

చీకటి నీడలు, నూతిలో కప్పలు మొదట కవితా సంపుటాలుగా వెలువడి బైరాగికి పేరు తెచ్చిపెట్టాయి. దివ్యభవనం వీరి కథల సంపుటి. 1978లో క్షయవ్యాధి గ్రస్తులైనారు. దానికి వైద్యం చేయించుకోడానికి విముఖత చూపారు. హైదరా బాదుకి మకాం మార్చారు. 1978 సెప్టెంబర్ 8న మరణించారు.

మరణానంతరం బైరాగి ఆగమ గీతి కవితా సంపుటికి 1984లో కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు ఇచ్చారు. కవిత, నాటకం, కథ, నవల ఏది రాసినా బైరాగి ముద్ర సుస్పష్టం. ఆయన తాత్త్విక ధోరణి సర్వత్రా కనిపిస్తుంది.

# ఒక గంట జీవితం

హోటల్ ముందు నిలుచున్నాడతను. బయట కార్పొరేషన్ దీపాలు వెలిగినయ్. జన ప్రవాహం ఇళ్ళవైపు మరలింది. నిశాచరులు అక్కడక్కడ వీధి మలుపుల్లో నిలబడి మాట్లాడుతున్నారు. గబ్బిలాల్లా ఎక్కడనించి వస్తారో ఈ జనం? రాత్రిపూట బయటపడతారు. ఆ మాసిన గడ్డాలూ, మురికి లుంగీలూ, చిరిగిన చొక్కాలూ, చిందరవందర జుట్లూ, రాత్రిపూట స్వేచ్ఛగా విహరిస్తయ్, పగలు కనపడవ్. పగటిపూట అంతా పెద్ద మనుషులే.

రాత్రులు ఆ పెద్ద మనుషులు ఏమౌతారో? హాయిగా పత్రిక చదువుకొంటో, రేడియో వింటో, వస్తూ వస్తూ కొనుక్కొనివచ్చిన వస్తువులు భార్య పిల్లలకు చూపిస్తుంటారు గామాల్ను. ఎనిమిదింటి దాకా పిచ్చాపాటి కబుర్లు, తొమ్మిదింటికి భోజనాలు, పదింటికి లైట్లు ఆర్పేసి పండుకోటం, పెద్ద మనుషులు, పిల్లా పాపా ఉన్న వాళ్ళు పాపం.

ఎందుకిక్కడ నిలుచోటం? హోటల్ లోపలికి వెళ్ళాడతను. పరవాలేదు. పదింటిదాకా కూర్చోవచ్చు, మధ్య మధ్య ఒక అరకప్పు కాఫీ త్రాగుతో, లైట్లు ఫుల్‌గా వెలుగు తున్నాయ్. జనం ఎక్కువ మంది లేరు. ఒక మూల టేబుల్ వద్ద కూర్చున్నాడు. అప్పుడు రానేవచ్చాడు సర్వర్ యమదూతలాగ. 'ఒక అరకప్పు కాఫీ స్ట్రాంగ్'.

రేడియో కుయ్యి కుయ్యిమంటోంది. లోపల ఆమ్లెట్టు వాసన వేస్తోంది. ఆ మూలనున్న సూట్ వాలాలు ఏమిటో గునగునలాడుతున్నారు. ఒకసారి తనవంక చూశారు. ఆ చూపుల్లో కుతూహలం లేదు. ఓహో నువ్వా? సరేలే! అన్నట్టుంది.

ఏమిటో ఆ రహస్యాలు? ప్రేమగాథలా? వ్యాపారపు కిటుకులా? ఇంటిదగ్గర గొడవలా? ఎలా తెలుస్తుంది? తాను రాత్రి చేసిన ఖూనీ దగ్గర నుంచి ఇక్కడ కాఫీ బాగాలేదనే వర్తమానంలోపు ఏదైనా కావచ్చు అది. కొంతమంది ప్రతిదీ గుసగుసలే మాట్లాడుతారు.

ఒంటరితనంగా ఉంది వాళ్ళ

## శ్రీశ్రీ ఓ యుగపురుషుడు

రెండు శ్రీలు ధరించిన
శ్రీశ్రీ శబ్ద విరించి
అభ్యుదయ కవితా విపంచి
ఓ శ్రీ - విషం చిమ్మే నాగు
తాడిత పీడిత ప్రజలపై జరిగే
అరాచకాలకి, అకృత్యాలకి 'ఖడ్గసృష్టి' చేశాడు.
దిక్కుచూపి, దిక్సూచి అయ్యేడు
అక్షరాయుధాన్ని సృష్టించి భూకంపం పుట్టించాడు.
మరో శ్రీ - అభ్యుదయ కవితకు శ్రీకారం
ఛందస్సు అలంకారాలతో రసరమ్యంగా విహరిస్తున్న
కవితాలత నడ్డివిరిచి భూ మార్గం పట్టించాడు
వచన రచన మార్గానికి దిశానిర్దేశం చేశాడు
ఈ శతాబ్దం నాదన్న శ్రీశ్రీ - అమాయకుడు
అభ్యుదయ అక్షరాలకు 'శ్రీ'కారం చుట్టిన అతడు
'యుగపురుషుడు'

డి.వసంతగంగాధర్

గుసగుసలు చూస్తే, ఇప్పుడు గోకుల్ వుంటే ఎంత బావుండును? ఇద్దరమూ ఇలాగే గుసగుసలాడే వాళ్ళం గామాలు. అప్పుడు ఎవ రన్నా చూచినా ఇలాగే అనుకొనే వాళ్ళు. కుర్చీమీద వెనక్కు ఆనుకొన్నాడు. జేబులోంచి సిగరెట్టు తీశాడు. ఇంకా నయం. ఇక్కడ సిగరెట్లు కాల్చడం మీద నిషేధం లేదు. ముట్టించాడు. ఒక గుక్క గట్టిగా పీల్చాడు. ఇప్పుడు కాస్త బాగుంది.

హోటల్ అద్దాల తలుపుల్లోంచి బయట వచ్చేపోయే జనం కనిపిస్తున్నారు. బిచ్చగాళ్లు, అడుక్కుతినే ముసలి ముండలు, దిక్కులేని పిల్లలు, ఇళ్ళకు తిరిగి వెళుతున్న జనం, చెదురాటుగా కులాసా మాటలు చెప్పుకుంటూ వెళ్ళే జంటలు. వాళ్ళకోసం వేచివున్నాయి ఇళ్ళు. పరిశుభ్ర మైన గదులు. తెల్లని వెలుతురు, చిరపరిచితమైన ఏకాంతం. ప్రతి వస్తువు దేనిచోట్లో అది. బయట చెట్లలో నుంచి చల్లనిగాలి. ప్రశాంతి, తృప్తి, సార్థకజీవితాల హాయి గొలిపే మత్తు, వాళ్ళు నిద్ర లేచేటప్పటికి సూర్యుడు సలామ్ కొడతాడు.

''బాబూ! ఒక కానీ,నాయనా! నిన్నటినుండి మెతుకు నోట్లోకిపోతే ఒట్టు'' ముసలిముండ! దరిద్రం. పడుచు దైనా పొట్టపోసుకొనేదే ఎలాగో అలా. దానికింకొక మార్గం లేదు. ముసలి వేశ్యలందరూ ఇలాగే తయారౌతారు. పాప ఫలితాలు. కాని అందరూ అనుభవించరు. ఎవరో అదృ ష్టంలేని వాళ్ళు అనుభవిస్తారు.

ఆ ముసలమ్మను చూస్తే మిసెస్ పాండ్యా జ్ఞాపకం వస్తుంది. ఆవిడకంటే ఎక్కువ పాపం చేసిందా ఈ ముస లమ్మ? ముసలితొక్కు, ముంచు మొఖం అదీ, సిల్కు చీరలు, పారసీ ఫ్యాషన్లు, రవ్వల హారాలు అదీ. రోజుకు ముగ్గురు పడుచువాళ్ళు కావా లంట. ఎప్పుడూ కుర్రా ళ్ళను వెంబడి వేసుకుని తిరు గుతూ ఉంటుంది సిగ్గుం టేగా, డబ్బు కూడా ఇస్తుందట. ఛీ! దాన్ని తలుచుకుంటే డోకువస్తుంది. దానికంటే ఈ ముసలమ్మే నయం. కాని ఆవిడ కూతురు బాగుంటుంది. పాపం అమాయిక, ఈ ముసలిది ఎక్కడికన్నా వెళ్ళనిస్తేగా? ఎవరితోనన్నా మాట్లాడినిస్తేగా? రెండు మూడుసార్లు వెళితే ఈ దరిద్రం ఎదురైంది. వదిలించు కొని బయటపడేటప్పటికి తల ప్రాణం తోకకు వచ్చింది.

సర్వరు కాఫీ తెచ్చాడు. ఒక్కగుక్క, చిరుచేదు. విష మని అంటారు. కాఫీ విషం. సిగరెట్ విషం. మన నిలు వెల్లా విషం. మనిషంత విషపు జంతువు ఏదీ లేదు. కొంత మంది ఆడవాళ్ళ చూపుల్లో, పెదవుల్లో విషం ఉంటుంది. ఆ విషానికి విరుగుడు ఈ విషం. విషస్య విషమౌషధమ్. సిగరెట్టయిపోవచ్చింది. పారవేశాడు. ఇంకొక సిగరెట్టు.

తమరు పరాకు చిత్తగిస్తున్నారు. కాఫీ గుక్క వేస్తూ ఎదురుగా అద్దంలో ముఖం చూసుకొన్నాడు. వెధవ

## ది అల్టిమేట్

నాయకుడన్నోడిని
నమ్మబోకురా
వాడి దేశభక్తి
భుక్తికొక్క యుక్తి
ఆస్తి సంపాదనకు
అజరామరమౌ శక్తి

కేయల్లేన

మొఖం, ఫరవాలేదు. దిగులుగా విచారంగా ఉన్న జంతువు మొఖం. చిత్రం! ఆ మొఖం తనదికాదు. ఎవడో కొత్తవాడు, గడ్డం కొంచెం తెల్లబడుతోంది. ముఖం పీక్కుపోయినట్టుంది. వయస్సు ముదురుతోంది. ముసలితనం. జీవితం తింటోంది తననుతాను.

బయటకు చూచాడు. ఇద్దరు మహిళామణులు వస్తున్నారు. హోటల్లోకే? ఆశతో అతని గుండె దడదడలాడింది.కాలక్షేపం. అనంత కాలావధిలో అరక్షణం. A thing of beauty is ...... కాలమనే ఖాళీపాత్ర నింపటానికేదో ఒకటి. హోటల్లోకి నిర్భయంగా వచ్చి కూర్చున్నారు ఎదురుబల్ల వద్ద. ఒకసారి చుట్టూ కలియచూశారు. మాటల్లో మునిగిపొయ్యారు. సర్వరు వాళ్ళదగ్గరకు వెళ్ళటం చూశాడతను. 'రెండు బ్రెడ్ అండ్ బట్టర్'.

విద్యుత్కాంతి ధారాపాతంగా కురుస్తోంది. నల్లటి జుట్టు సిల్కు దారాల్లా మెరుస్తోంది. తెల్లటి వెలుగు జీరలు జుట్టుమీద నుంచి జాలుగా క్రిందికి దిగి, మెడ క్రింద మెత్తని లోయల్లో నీడలు కల్పిస్తో, భుజాల వంపుల మీద తళుక్కుమంటున్నవి. బంగారం పండుతున్నది ఒంటిమీద. కనకకామిని.

అతడా దృశ్యాన్ని కళ్ళుమూసుకొని మనస్సులో ఆనందించసాగాడు. సింద్‌బాద్ అనే కూలివాడు ఒక అమ్మాయికి కావలసిన సరుకులు మోసుకువెళ్ళాడు. అదొక రాజభవనం. రాజుమాత్రం లేడు. సరుకులు దించాడు. ముగ్గురు కన్యలు, కాదు, ఇద్దరే, ఎంత చూసినా మూడో కన్య కనబడటంలేదు.

ఆ భవనంలో మగవాళ్ళెవరూ లేరు. దాసీలు మాత్రమే. సింద్‌బాద్ అనే కూలివాడికి విందు. ఛప్పన్నారు పిండి వంటలు, ద్రాక్ష, కిస్మిస్, రకరకాల పండ్లు. ఆ భవన ప్రాంగణంలో ఒక సరస్సు ఉన్నది. వెన్నెల, నీటిలో చంద్రుడు, జలక్రీడలు, నవ్వులు వెన్నెల్లో తెల్లగా తళతళమెరుస్తున్న దేహాలు, అదేమిటని అడిగారు, ఏమీ తెలియని అమాయికలు. కస్తూరి, పునుగు, జవ్వాజి, అగురువొత్తుల వాసన, దివ్యదేహాల పరిమళం.

అకస్మాత్తుగా అతని కల కరిగిపోయింది. ఆ ఇద్దరిలో ఒకామె కుర్చీమీద వెన్ను విరగబడి నవ్వుతున్నది కిలకిలా, పకపకా, అతనికి కోపం వచ్చింది. సింద్‌బాద్‌ను ఇద్దరు కన్యలూ రాజభవనంలోంచి తరిమేశారు. కిలకిలా, పకపకా, క్రిందికి కట్ చేసిన నీలిరంగు సిల్కు బ్లౌజులోంచి వెనక విరుపు వలన పొంగివచ్చిన ఉన్నత వక్ష సౌందర్యం, కంఠసీమలో రత్నాహాలు ఉబికి మేల్కొన్నాయి. గాజు మేడలో నగ్ననృత్యం చేస్తున్న అప్సరసలు.

## బ్రహ్మతరమే...

నా దేశాన్ని
గంజాయివనంచేసి
ఒక్క తులసి మొక్కను
వెదికి తెండిరా అంటే...

నా దేశాన్ని
సురసముద్రం చేసి
ఒక్క గాంధీ తాతను
వెదికి తెండిరా అంటే...

నా దేశాన్ని
ధనదాహాకులను చేసి
ఒక తథాగతుడిని
వెదికి తెండిరా అంటే...

నా దేశాన్ని
కులగజ్జి పుట్టను చేసి
ఒక్క కబీరు దాసును
వెదికి తెండిరా అంటే...

నా దేశాన్ని
స్వార్థాగ్ని గుండం చేసి
ఒక్క 'అల్లూరి'ని
వెదికి తెండిరా అంటే...
బ్రహ్మతరమే.

మునిసుందరం

And breasts like Champagne glasses.
All her belongings on show.

వీధి దీపం వెలుతురులో పురుగులు ముసురుకొని వలయాకారంగా ఎగురుతూ ఆడుతున్నవి. ముసలమ్మ మురుగు కాలవమీద కూర్చుని తలగోక్కుంటున్నది. ఎవరో ఒకబ్బాయి రెండు చేతులు విడిచిపెట్టి సైకిలు తొక్కుకుంటూ వెళ్ళాడు.

ఎదురుగా రెండంతస్తుల మేడ వెనుక నుంచి చుక్కలతో పొదిగిన ఆకాశపు పీలిక కనుపిస్తోంది. ఏది నిజం? సిగరెట్టు పొగలోంచి, కాఫీ చిరుచేదు నిషాలోనుంచి,

సుందరీవక్ష వీక్షణ సౌభాగ్యా నంద కందళిత హృదయా రవిందనై అడుగుతున్నాను.

నేను? ఏది నిజం? సిల్కు చీరలా? చింకి గుడ్డలా? మాడినకడుపులా? బలిసిన రొమ్ములా? వృద్ధ వేశ్య ప్రలాపాలా? జవ్వనుల పకపకలా? చీకటిలో ఒంటరితనం? వెలుగులో జంటలు? ఏది నిజం? చావు బ్రతుకుల సంజ మసక. కల్తీలేని వెన్నకాచిన నిజం ఏది? ఎలాగురుతుపట్టటం దాన్ని?

చచ్చిపోయిన మనిషి. The drowned phoenician sailor. టి.బి. ఆసుపత్రిలో చచ్చిపోయిన అమ్మాయి జ్ఞాపకం వస్తోంది. నెత్తురులేమితో పాలి పోయిన ముఖం. మూగ బడిన కళ్ళు. తెల్లగా చలువరాతి విగ్రహంలా, మృతక సౌందర్యం, మృత్యువు ప్రేమించింది ఆమెను. మృత్యు శైత్యల్యం ఆమె అవయవాల్లో, ఆ పాలిన పెదిమలు జీవితం ప్రసాదించే వెచ్చని ముద్దులు ఎరిగివుండవు.

ఏమి అనుభవించింది ఆమె జీవితంలో ఆనందం? డాక్టర్లు, మందులు, నర్సులు, ఆసుపత్రి తెల్లని గోడలు తప్ప ఏమి ఎరుగు ఆమె? ఆమె పడుకొని ఉన్నది ప్రశాంతంగా. తెల్లతామరలాంటి ముఖంపై తుమ్మెద ముంగురులు.అలసి నిద్రపోయినట్టుంది. ఆమె పెదిమల చుట్టూ దివ్యమైన చిరునవ్వు ఆడుతున్నది. ఏమిటా నవ్వు? ఎవరిని చూచి? మళ్లా ఎప్పుడూ మేలుకోదు ఆమె!

Cardelia! Cardelia! Stay a while; she was ever so gentle and meek; an excellent quality in women.

ఈమె నవ్వుతోంది. ఆమె మళ్ళా ఎన్నడూ నవ్వదు. నవ్వుల రోజుల్లో నవ్వకపోతే ఎలా? ఉప్పొంగుతున్న రక్త నాళాల్లోంచి, నున్నని మెత్తని అవయావాల్లోంచి, వినీల విద్యుత్కాంతులు కురిపించే కళ్ళల్లోంచి, ముఖమల్ చర్మాన్ని ఒరుసుకొని ప్రతి ఫలిస్తున్న జీవధావళ్యం లోంచి

## విశ్వాసం

ఏ మూలనుంచి వచ్చిందో
ఓ కుక్కపిల్ల
ఆశగా ఆబగా చూసింది
నా కడుపు దేవినట్టయ్యింది
ఓ బిస్కట్ విసిరాను.
కృతజ్ఞతగా తోకవూపి
నాలుక చాస్తూ
నా చుట్టూ తిరిగింది
ఎదిగిన నా బిడ్డలు
ఎక్కడెక్కడికో
ఎగిరిపోయేరు
కుక్క మాత్రం
నన్ను వదల్లేదు

బద్ది నాగేశ్వరరావు

ఏవో పరిమళాలు గుబులుకొంటున్నాయ్. మధు మదిరా గంధం తలకెక్కుతున్నది. అస్పష్టమైన కదలిక,చక్కలి గింతలు, ఉండబట్టలేక ఆమె నవ్వుతున్నది. నవ్వనీ, ఆమె ఇంకా జీవితపు చేదు రుచి చూడలేదు.

ఇప్పుడు ఆమె పెద్దగా మాట్లాడుతున్నది. ప్రక్కనే కూర్చున్న స్నేహితురాలి కొరకు ఆమె అంత పెద్దగా మాట్లాడనక్కర్లేదు. ఆ నవ్వుకూ ఆ మాటలకీ ఏమీ సంబంధం లేదు. అది ఉత్త నవ్వు. నవ్వుకోసమే నవ్వు. Trying to show off, is it? ఆకర్షించటానికి, సాలీడు వల. ఎలుకతో చెలగాట మాడే పిల్లి. వేటలోనున్న ఆనందం, ఆనందం కొరకు వేటకాదు. Bait him. Torture him. Tickle the life out of him.

వేధించు, కాళ్ళమీద పడిందాకా ఊరుకోకు. వాడిని కుక్కలా తయారుచెయ్యి.దగ్గరకు వస్తేలాగి ఒకటి తన్ను, కుయ్యి కుయ్యిమంటూ పోతుంది కుక్క!

ప్రేమ, sadism. అవయవాల మరణయాతన. దాస్యంలోని ఆనందం. ఏమి నిష్కపటం? ఏమి నిష్కల్మషం? ఇతరులు తనను కోరేట్టు చేసుకుని తన అస్తిత్వానికొక అర్థం కల్పించుకోటం.అతని కొరకు ఏం చేయగలవు? నిప్పుల్లో దూకగలవా? దూకిన నీ అహంభావాన్ని తృప్తిపరచుకోటం కోసం, అతని కోసం కాదు. అర్థం లేదు.

అతడు ఆ నవ్వుతున్న అమ్మాయివేపు చూశాడు. అతని దృష్టి ఆమె ఉన్నత వక్షోజాలమీద లేదు. విద్యుత్కాంతిలో తళతళ మెరుస్తోన్న చెంపలమీద లేదు. ఆహ్వానిస్తోన్న అరుణాధరాలమీద లేదు. పరిరంభానికి పిలుస్తోన్న బంగారపు చేతులమీద, తొడలమీద లేదు. అతడు చూస్తున్నాడు. ఈ రంగురంగుల తెరను చీల్చుకొని పోయి ఆమె ఆత్మ ఉండే చీకటి గదిలోకి. Void and waste. Waste and Void. and darkness was upon

the face of the waters.

దిగులు, విచారం, మానవజాతి, భవిష్యత్తు, అతీత దేశచరిత్రలు, క్షయరోగం ప్రేమించిన కన్నెపడుచు. మురుగు కాలవమీద ముసలమ్మ. నీ ఉన్నత వక్షోజాలు నేను చూశాను. నీవీ చోటుకు అందం తెచ్చావన్న సంగతి నాకు తెలుసు. కాని... కాని... ఎందుకో విచారం, దిగులు, Waste and void.

మానవజాతుల శోకార్ద్రం గీతం! నిన్ను వెంబడిస్తున్న శిథిలాలు. క్షణాన్ని లోకం నుంచి వేరుచేసి విడిగా తీసుకోవటం ఎలాగ? సౌందర్యం సమక్షంలో విచారానికి తావివ్వకపోవటం ఎలాగా? నీ కవతల, నీ ప్రక్కన, నీలోనగాక నన్నే చూడటం ఎలాగ? జ్ఞాపకాల తలుపులు మూసి, మృత వాయువలు మట్టి వాసనలు రాకుండా చేసి నీ పరిమళాన్ని అందుకోవటం నీకు చేతనౌతుందా? అనుమానం, సందేహం, భయం, విశ్వాసం లేదు ఈ కాలపువాళ్ళకి.

అప్పుడు మొదలుపెట్టింది రేడియో గొంతుక. వాయులీనం. ఆనందభైరవి, నెమ్మదిగా నవ వధువు అడుగుల సందడిలా, ఆకాశంలో ఓ మూల చివరనించి మబ్బు తునక లేచినట్టుగా, తూచినట్టుగా నెమ్మదిగా లేచింది పైకి. సముద్ర గర్భంలోంచి నాగకన్యలా. ఒక అనూనుష కంఠం. దివ్యస్వరం. Between some talk of you and me. ఎక్కడున్నది ఇది ఇప్పటిదాకా?

మాయానగరపు సింహద్వారంలో రాకాసికీ రాజకుమారికీ మధ్యనలిగిపోతున్న నేను నేను కానప్పుడు ఎక్కడున్నదిది? అంతా నిశ్శబ్దమైనప్పుడు నీవు నాతో నా కొరకు అనకుండా అన్నది నేను విన్న సంగతి నీవు విన్నానని నేను విన్నావని నీవు అనుకొన్నప్పుడు ఎక్కడున్నదిది? ఇక నీవు నవ్వితే, రాళ్ళు రువ్వితే పువ్వులు కురుస్తాయి జాగ్రత్త!

వాయొలిన్ మ్రోగుతున్నది. లోపలినుంచి, బయటినుంచి, ఇటునుంచి, అటునుంచి, అన్నివైపుల నుంచి, From everywhere and from nowhere ఆత్మనీ దేహాన్ని కబళించి సౌందర్యపు అదృశ్యాస్పృశ్యజ్వాలా కీలల్లో బ్రహ్మాండాన్ని చుట్టుముట్టి మహోత్తుంగ స్వరతరంగాలు. ఎక్కడున్నావ్ ప్రేయసీ! నీవు తుపానులో చిక్కుబడిపోయావ్. నీకంటే మహత్తర భీకర సుందరమైనదేదో నిన్నావరించేస్తున్నది. నీ విప్పుడు నాలోఉన్నావు. నేను తుఫానులో ఉన్నాను.

తుఫాను మన అందరిలో ఉంది. అందరం ఎక్కడా లేము. దేశకాలావధులు దాటి నారధారంగా, విచారంగా, దూరంగా పోతున్నాం ఎక్కడికో! We are lost. We are the first of the first of the latest and last edition of the lost generations. ఎక్కడికి వెళ్తున్నాం. మనం ప్రేయసీ! మహీయసీ!

వాయొలిన్ మూల్గుతున్నది. బాధగా, జాలిగా, ప్రేమగా, ఆనందం భరించలేక, దుఃఖం పట్టలేక, చిన్నగా మెల్లగా ఉయ్యాల ఊపులాగా వాయుతరంగంలాగా. అందుకనే వాయులీనం అన్నారు. మునుగుతున్న పడవలా మునిగిపోయి, ఎగిరే విమానంలా తేలిపోతున్నది. తల్లి ఒడిలో పిల్లవానిలా ఊగుతున్నది. ఏదో ఒక అదృశ్య వస్తువు ధవళ వేగంతో చీకట్లో ఈ మూలనుంచీ ఆ మూలకు ఆ మూలనుంచి ఈ మూలకు తిరుగుతున్నది. The rocking rythm of rising passion. To and fro. To and Fro. రెండు ధృవాలనూ ఒకే స్పర్శతో తాకుతున్నది. విద్యుత్ప్రవాహంలా.

వాయొలిన్ మ్రోగుతున్నది. మూల్గుతున్ని. వెల్గుతున్నది. ప్రతీక్షలో ఆనందం. నీ హృత్స్పందన నందన ఛందం. స్పర్శ కొరకు ఎదురుచూడటం. మృత్యుస్పర్శ కొరకు, అగ్ని స్పర్శకొరకు. తీగల్లా సాగిన నరాలు. మెరుస్తోన్న చర్మం.

ఈ రాత్రికి ఈ జ్వాలాకీలలు ఎక్కడ ఎరువు తెచ్చావ్. సూర్యకాంతమణులు నీ నేత్రాలు. ఎందుకు అలా చూస్తావ్? నీ అవరుద్ధ నిశ్వాసాలు ప్రభంజనాగమాన్ని సూచిస్తున్నాయ్. భావి సంఘర్షణ కొరకు ఆకాశం వేచియున్నది. Sometlhing of the stom we have in ourselves వాయొలిన్ సంగీతం సూచిస్తున్నది. రాబోయే తుపాను, పొడవబోయే ప్రొద్దు, ముసురుకొనే రాత్రి, ఆనందపు అంచులు, కడసారి కౌగిలింత, నేటి అద్దంలో రేపటి ప్రతిబింబం, గతకాలపు ప్రతిధ్వనులు.

వాయొలిన్ మూల్గుతున్నది. ఆద్యంతికానందంతో మరణయాతనతో మెల్లగా చల్లగా మూల్గుతున్నది. Ecstasy of agony, Agony of ecstasy, Blissfully forgetful of reality. గట్టిగా పట్టుకో, తేలిపోతున్నావు. ఆ ధ్వని మెల్లగా లేస్తున్నది. కైలాస శిఖరాన్ని అందుకొనేందుకు, ఆకాశాన్ని చుంబించేందుకు, మహాతరంగంలా లేస్తున్నది. ఆ తరగ పడిపోయేటప్పుడు ప్రపంచాన్ని మంచు తేనియల సోనవానలో ముంచెత్తుతుంది. జీవితపు తంత్రులపై ఉన్మాద సంగీతం.

ఉరి ఉచ్చులో బిగిసిన గొంతులోంచి వెలువడే గురగురలు. మరణోన్ముఖ మృగశాబక చీత్కారం. అనంత అశ్రుసాగరాల ఘోష. అరణ్యమున హరీంద్ర గర్జన. కరిగిన

లోహప్రవాహంలోని నీలివంటలు. దేవాలయాల గంటలు. సురతాంత మహానందపు అణగిమణగిన కుల కూజితాలు. జీవితం! జీవితం!

ఆ ధ్వనిలేస్తున్నది అనంతశూన్యంలోకి. అందరాని దానిని అందుకునేందుకు. సుఖ దుఃఖాలకతీతమైన పరిపూర్ణస్థితిని పొందేందుకు. మహోన్నత గిరిశిఖరాల నగ్నత్వాన్ని, పూచినచెట్ల పసిమినీ, రాలిన ఆకుల చప్పుడునీ, జనపదాల, వనపదాల, మృదుపదాల, పరివిధాలు సంచారం, నీ అభిసారం. ఎక్కడికి ప్రేయసీ! నేనూ వస్తున్నా.

ఇంకా పైకి! ఇంకా పైకి! ఆగవద్దు, నా గుండెకూడా ఆగిపోతుంది. నశ్వరశరీరాల శృంఖలాలు త్రెంచుకొని మహోజ్వల మహోచ్చల సంగీతానికి. The zero hour on the threshold of eternity is over. We are in the thick of it. ఊపూపు ఉయ్యాల మామయ్య, బ్రహ్మాండపు గడియారంలో చరిత్ర పెండ్యులం ఊగుతోంది.

నెత్తురు పాట.ఆఫ్రికాలో అర్ధరాత్రి, కోపగించిన విసూవియస్ జలపాతం. ఝంఝూపాతం, అణ/శక్తి విస్ఫోటం,బ్రద్దలైన సింహకవాటం, తెర ఎత్తిన అవ్యక్తంలో కన్నెపడుచు రక్తం. నయాగరా, హరాకిరీ, హిరోషిమా నును వెచ్చని కౌగిలింత. Horizontally wakeful amidst the universal widths.

సిగరెట్టు మొదటి దమ్ము. నిద్రా జాగరణాలు, హాస రుదనాలు. జీవితపు శంఖధ్వని, రాట్నం వడుకుతున్న చలం, కుటుంబరావు సకుటుంబ సమేతుడు. శ్రీశ్రీ శివతాండవం, అసమర్థుని జీవయాత్ర. బైరాగి కొకరాగి కానీ, హిమాలయ ప్రభాతకాంతి. ప్రశాంత సాగరంలో జలసమాధి. అగ్నికుండపు ఆవేదన. Icecream. T.S.Eliot and Romeo Zuliet. ఎవరు నేర్పారు నీకీ విద్య?

సంగీతం ఆగింది. కాలం ఆగి ఊపిరి పీల్చుకో సాగింది. ప్రపంచం చెమట తుడుచుకొంటోంది. ప్రేయసీప్రియులు అలసిసొలసి నిద్రించారు. అంతా ఇదివరకు మాదిరిగానే వుంది. లేదు.

ఈ రాత్రిపూట ఒక గంట విద్యుద్దీపాల కాంతిలో యౌవన సాన్నిధ్యంలో ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. లేదు కాలం ఆగింది. కాలం సాగింది. కాలం గుండె దడదడా కొట్టుకొన్నది ఒక్కక్షణం.

అతడు లేచి తలకాయ వంచుకొని బిల్లు చెల్లించి చకచకా బయటకు నడిచాడు. వెనకకు తిరిగి చూడనన్నా లేదు. అతని జీవితఖండం ఒక నిమిషం మేల్కొని నిద్రించింది.

బయట నక్షత్రకాంతిలో, నిశాసారభశ్వాసలు చెంపల్ని తాకుతుండగా అతడొక నిట్టూర్పు విడిచాడు. దుమ్ము నిండిన గదిలో సిగరెట్ పీకలు. To sleep, prepare for life. Each morning new horror brings. అయితేనేం? మిగిలిన రోజులన్నీ ఎడారులైతేనేం? రేపు దయమే, ఈ క్షణమే నేను చస్తేనేం? నేనొక గంట జీవించాను. చాలా వాస్తవంగా జీవించాను. ■

## అవునా? నిజమేనా?

నవ్వులన్నీ పూవులవునా?
పదములన్నీ రాగఝరులవునా?
చూపులన్నీ కరుణారసామృత వర్షిణీ తరంగిణీ
లవునా?
క్షణములన్నీ నిర్మల నిశ్చల ప్రతీక్షణా వీక్షణము
లవునా?
మనసులన్నీ గంగాయమునా సరస్వతీ సంగమము
లవునా?
కులములన్నీ కలమునసాగే కమనీయ గీతికలవునా?
మతములన్నీ మమతల మందాకినులవునా?
సమతల రాగమాలిక లవునా?
అవునా? నిజమేనా?

కొండూరి రమాకాంత్

## మా బాలగోపాలం!

మానవ'హక్కుల కోసం
పరితపించే గుండె
ఆగిపోయింది!
అంతంత మాత్రమైన
హక్కుల ఉద్యం
తృప్తిపడింది!!

-ఆపిల్